"డార్క్‌డెవిల్‌గారే చెప్పారు సార్! మీరేం ఆర్డర్ చేస్తే అది ఇమ్మని"

"థాంక్యూ, నాకేం వద్దు."

"పర్లేదు సార్! ఏదొకటి తీసుకోండి! అందరూ అంత సుఖం అనుభవిస్తుంటే మీరు అలా నిశ్శబ్దంగా వుంటే బావుండదు. బిల్లు మీరు ఇవ్వఖర్లేదని కూడా డార్క్‌డెవిల్‌గారు చెప్పమన్నారు".

సురేష్‌కి నవ్వొచ్చింది.

"ఆల్‌రైట్, ఒకే ఒక్క బీరుబాటిల్! డార్క్‌డెవిల్ హెల్త్ కోసం."

"ఒకే సర్"

హఠాత్తుగా మ్యూజిక్ ప్రారంభమయింది. డార్క్ డెవిల్ మళ్ళీ విజృంభించాడు.

ఇంకో అమ్మాయి వచ్చింది స్టేజ్ మీదకు అర్ధనగ్నంగా, అందంగా అద్భుతమయిన విన్యాసాలు చేస్తోంది. హఠాత్తుగా స్ట్రిప్‌టీజ్ మొదలయింది . అందరికీ సెక్స్‌ఫీవర్ పెరుగిపోతోంది . చిన్న గుడ్డ పీలికల్లాంటి దుస్తులు మాత్రం మిగిలాయి చివరకు . బీర్ బాటిల్ ఎప్పుడయిపోయిందో తనకే తెలీదు.

కాబరే డాన్సర్ దిగి ఒక్కొక్క టేబుల్ దగ్గరకెళ్ళి సరసాలాడుతోంది . మీసాలతను ఆమెకు ఓ గ్లాసులో బ్రాందీ పోసిచ్చాడు.

ఓ గుక్క తాగి అతనికే మళ్ళీ ఆ గ్లాసు ఇచ్చిందామె. తర్వాత మరో టేబుల్. వరుస ప్రకారమయితే ఆ తరువాత తన టేబుల్ దగ్గరకే వస్తుందని అర్థమయిపోయింది సురేష్‌కి . ఎలా ఆ అమ్మాయి బారినుంచి తప్పించుకోవడం?

"హలో " వచ్చేసి సురేష్ కెదురుగా కూర్చుందామె.

ఆమె నగ్నరూపం మతి పోగొడుతోంది.

"హల్లో" బలవంతంగా నవ్వు తెచ్చుకుంటూ అన్నాడు.

సురేష్ చేయి తీసుకుని తన చేతుల్లో వుంచుకుని ముద్దు పెట్టుకుందామె. ఆమెను క్లోజప్‌లో చూసి ఉలిక్కిపడ్డాడు. ఆమె ఎవరో తనకు తెలుసు! ఎక్కడో, ఎప్పుడో చూశాడు. ఆ అమ్మాయి కూడా సురేష్ వంక చూసి అంతకుముందే పరిచయమున్నట్లు మరోసారి చూసింది పరీక్షగా.

"నువ్వు సురేష్‌వి కదూ?"

"నటాషా!"

"సిల్లీఫెలో! ఇంతసేపా గుర్తుపట్టటానికి."

"నీ నేకెడ్ బాడీలో చిన్నప్పటికి ఇప్పటికి చాలా తేడాలొచ్చి నయ్ కదా? ఎలా గుర్తుపడతాను"

"ఓ .కే , తర్వాత మాట్లాడదాం వెళ్ళిపోకు. ఆ రాబందులన్నీ ఆకలిగా చూస్తున్నాయ్. వెళతాను " అంటూ సురేష్ చేయి అందుకుని ముద్దు పెట్టుకుని
మరో టేబుల్ దగ్గరకు వెళ్ళింది.

రాత్రి పన్నెండింటివరకూ క్యాబరే డాన్స్‌లు సాగుతూనే వున్నాయ్. సురేష్‌కి అక్కడి నుంచి వెళ్ళిపోవాలనుంది గానీ నటాషాతో మాట్లాడాలని కూడా వుంది .
ఈ రొచ్చులోకెలా దిగబడింది పాపం ? ఒకటా, రెండా? ఎయిత్ క్లాస్ వరకూ ఇద్దరూ క్లాస్‌మేట్స్. కేవలం క్లాస్ మేట్స్ కాదు ఆ కొద్ది సంవత్సరాలలోనూ వంద సంవత్సరాల జీవితం చవిచూశారు.

డార్క్ డెవిల్ వచ్చి కూర్చున్నాడు సురేష్ దగ్గర.

"ఎలా వుందిరా మన పెర్‌ఫార్‌మెన్స్"

"ఫెంటాస్టిక్."

బేరర్ ఇద్దరికీ రెండు బీర్ తెచ్చి టేబుల్ మీదుంచాడు.

"ఇంక వద్దురా."

"ఫర్ ది హెల్త్ ఆఫ్ యువర్ లవ్‌లీడాల్. పేరేమిటన్నావ్?"

"తులసి"

బీరు తాగుతోంటే నటాషా వచ్చింది. ఇప్పుడు పూర్తి డ్రస్‌తో వుంది. చీర జాకెట్టు చెవులకు రింగులూ మెడలో నెక్లెస్ లిప్‌స్టిక్ మేకప్ ఇంకా అలాగే అందంగా అంటి పెట్టుకుని వుంది.

"నటాషా ఇక్కడే వుందని చెప్పలేదేం?" డార్క్ డెవిల్‌ని అడిగాడు సురేష్ .

"ఇవాళ నిన్నీ బార్‌కి రమ్మని ఎందుకు చెప్పాననుకున్నావు మరి ? నా గిటార్ వాయింపు చూడ్డానికా? నో, నువ్వు నటాషాను కలుసు కుంటావని."

"అంటే డార్క్ డెవిల్ నువ్వూ కలుసుకుంటున్నారా ?" అడిగింది నటాషా.

సురేష్ తాగిన బీరు గ్లాస్ తీసుకుని తానూ తాగుతూ.

"ఎస్ డియర్! ఈ మధ్యనే కలుసుకున్నాం. చాలా కాలం గ్యాప్ తర్వాత."

"మరి నాకా విషయం చెప్పలేదేం"

"మీ ఇద్దరికి సర్ ప్రయిజ్ యివ్వాలని."

"థాంక్ యూ డార్క్ డెవిల్! నిజంగా చచ్చేంత సర్‌ప్రయిజ్ అనుభవించాం" అతని చెయ్యి పట్టుకుని ఆప్యాయంగా నొక్కాడు సురేష్ .

"మీరు బయట గేటు దగ్గర నిలబడండి. నేను ఇప్పుడే వచ్చేస్తాను" అంటూ లోపలకెళ్ళాడు డార్క్ డెవిల్.

సురేష్ , నటాషా బార్ బయటికొచ్చి  గేటు వైపు నడవసాగారు.

సురేష్‌కింకా మెదడు పని చేయటం లేదు.

"బ్రిలియెంట్ గాళ్ అని హైస్కూల్లో పేరు తెచ్చుకున్న అమ్మాయి డాక్టర్‌గానో, ఇంజనీర్‌గానో , సైంటిస్ట్‌గానో వెలిగిపోతుందని టీచర్స్ అందరు వూహించిన నటాషా ఎందుకిక్కడ క్యాబరేలు చేస్తూ, అంగాంగాలు  ప్రదర్శిస్తూ, రాబందుల వళ్ళో కూర్చుంటూ -"

"ఏమీ మాట్లాడవేం  ?" అడిగింది నటాషా.                    '    "

"ఇందులోకెందుకు  దిగావ్ నటాషా"

"మనందరినీ మనం చేసే పనుల్లోకి పరిస్థితులు దించుతాయ్"

"ఎక్కడుంటున్నావిప్పుడు."

"ఒక  నెల హైదరాబాద్, ఒక నెల   బాంబే, ఒక నెల ఢిల్లీ,  ఒక నెల వైజాగ్.... అలా గడిచిపోతుంది"

"మీ  అమ్మా నాన్నా చెల్లెలూ"

"అంతా వైజాగ్ లో వుంటున్నారు "

కారు వచ్చి ఆమె పక్కన ఆగింది.  బ్యాక్‌సీట్ నిండా క్యాబరే అమ్మాయిలు.

డోర్ తెరుచుకుంది.

"రేపు రూమ్‌కి రా.  హోటల్  గౌతమ్ రూమ్ నెంబర్  696."

సురేష్  ఆశ్చర్యపోయాడు.  "హోటల్ వాళ్ళకెలా తెలిసిందా సంగతి.

"ఏ సంగతి ?" తెల్లబోతూ అడిగింది."

"అదే నీకు 696 నెంబర్ యివ్వాలని."

నటాషా తన బ్యాగ్‌తో అతని నెత్తి మీద కొట్టింది . " ఇంకా గుర్తుందా అది?" అంది గొంతు తగ్గించి రహస్యంగా.

కారు హారన్ మోగింది.  ఆమె కార్లో కూర్చుని చేయి వూపింది.   మరికొద్ది నిమిషాల తర్వాత  వచ్చాడు డార్క్ డెవిల్ తూలుకుంటూ.

"సురేష్ ! ఇవాళ కనిపించాడు ఆ బాస్టర్డ్ !" అన్నాడు పిడికిళ్ళు బిగిస్తూ.

"ఎవరు?"

"మా పెద్దనాన్న."

సురేష్ వులిక్కిపడ్డాడు.

"ఎక్కడ?"

"నువ్వు రాకముందు బార్లో కూర్చున్నాడు మరికొన్ని నక్కలతో పాటు.  గుర్తుపట్టి టేబుల్ దగ్గరకెళ్ళాను .  నన్ను చూసి ఏం చేశాడో తెలుసా?  పారిపోయాడు."

సురేష్‌కి డార్క్ డెవిల్ మీద జాలేసింది.

"ఒ రేయ్! నువ్వింక ఆ విషయం మర్చిపోవటం మంచిది."

"నేను మర్చిపోయాను. ఆ బాస్టర్డ్ కనబడి మళ్ళీ గుర్తుచేశాడు. ఆటో ఏయ్ ఆటో !" ఆటోని పిలిచాడతను.

ఇద్దరు ఆటోలో కూర్చున్నారు. "మీ ఇల్లెక్కడో డ్రైవర్‌కి చెప్పు ముందు".

డార్క్ డెవిల్ పాట మొదలుపెట్టాడు.

"హసీనా ఎక్కడుందిప్పుడు ?"

డార్క్ డెవిల్ పాట ఆగిపోయింది సడెన్‌గా. చటుక్కున సురేష్ చొక్కా పట్టుకున్నాడు.

"హసీనా సంగతి ఎందుకు గుర్తుచేశావిప్పుడు?"

"నాకు గుర్తుకొచ్చింది"

"నువ్వెవడివి నా హసీనాను గుర్తుతెచ్చుకోడానికి?"

"నీ ఫ్రెండ్‌ని"

డార్క్ డెవిల్ అతని చొక్కా వదిలేశాడు.

"వద్దురా. ఆ రోజుల్ని ముందుకి లాగొద్దు! అలానే అడుగున పడివుండనీ" అతని కళ్ళల్లో నీళ్ళు మెరిసినయ్.

సురేష్‌కి దుఃఖం ఆగలేదు.

"మై పూర్ డార్క్ డెవిల్" అన్నాడు అతని భుజం మీద చెయ్యి వేసి దగ్గరకు తీసుకుంటూ.

ఎంత నరకం అనుభవిస్తున్నాడు వాడు?

మేడల్లో వుంటూ, కార్లలో తిరుగుతూ జీవితం గడిపినవాడు బతుకుతెరువు కోసం కేబరే షోల్లో గిటార్ వాయిస్తూ , 'నా' అనే వాళ్ళు లేకుండా.

ఇదంతా కేవలం అతని పెద్దనాన్న చేసిన మోసం ! డార్క్ డెవిల్ గాడి తండ్రి సడెన్‌గా హార్ట్‌ఎటాక్‌తో పోయినప్పుడు రాత్రికి రాత్రే ఎకౌంట్లు మార్చి లాభాన్ని నష్టాలుగా చూపి, ఆస్తుల్ని అప్పులుగా చేసి కట్టుబట్టలతో డార్క్ డెవిల్ గాడినీ, వాళ్ళమ్మనూ బయటగ్గెంటితే- ఎవడి తరం ఈ దారుణం
భరించడం.

అందుకే ఆ దారుణాన్ని మర్చిపోవడానికే ప్రయత్నిస్తున్నాడు వాడు.

పూర్తిగా మర్చిపోడానికి.

ఆటో ఆగింది.

"గుడ్ నైట్" అన్నాడు సురేష్ దిగి.

ఆటో వెళ్ళిపోయింది.

తులసి నిద్రలోనే దూరంగా నెట్టిందతనిని.

"తాగావ్ కదూ?"

"అవును"

"డార్క్ డెవిల్ దగ్గరకెళ్ళావా?"

"ఊఁ"

కొద్దిక్షణాలు నిశ్శబ్ద యుద్ధం జరిగింది.

"నా నిద్ర చెడగొట్టకు" అతని చేతులు తీసి వేస్తూ అంది.

"నేననేది  అదే నువ్విలా పోట్లాడుతుంటే తెల్లారిపోతుంది.  నీ నిద్రంతా పాడయి..."

"సురేష్"  కోపంగా అందామె.

"హ.  నిన్నెవడు చేసుకుంటాడోగాని అంటార్కిటికా టీమ్ లో చేరి పోతాడు"

తులసికి  నవ్వాగలేదు.

"ఎందుకు?"

"నీకంటే 'ఐస్' నయమని".

తులసికి తెలిసిపోతోంది  తనింక రెసిస్ట్ చేయలేదు.

"సురేష్ !  ఇంక నిద్రపోనీ లేకపోతే ఉదయం ఆఫీసులో........."

తలుపు కొట్టిన చప్పుడు.

"పాల ప్యాకెట్టేమో?"

తులసి అయిదు నిమిషాల తర్వాత తలుపు ఓరగా తీసి పాలప్యాకెట్ కోసం చేయి బయటకు జాపింది.

గంగాభవాని ఆమె చేతిని పట్టుకుని గిల్లింది నవ్వుతూ.

"తొమ్మిదయినా లేవకపోయేసరికి ఇంట్లో వున్నారా, లేదాని....."

మత్తు వదిలిపోయింది ఇద్దరికీ.

"మైగాడ్!  తొమ్మిదా?" ఒక్క దూకు దూకాడు సురేష్.  తులసి లోపలికి పరుగెత్తింది. గంగభవాని లోపలికొచ్చేసింది నవ్వుతూ.

"ఏప్రిల్ ఫూల్స్ ! టైమ్ అయిదే అయింది"

*  *  *

తులసి రడీ అయిపోయింది.

"ఇదిగో!  నువ్ తెచ్చిన బుద్దుడి  బొమ్మ బాగానే వుంది కానీ
ఇక్కడ ఈ చెవి ముక్క విరిగింది    చూడు"

సురేష్  అందుకుని చూశాడు. “మోసం!  అమాయకులయిన కస్టమర్స్‌ని ఇలాగా మోసం చేసేది?”

“రిటన్ చేస్తావా?”

“ఎందుకులే ఇంకోటిస్తాను నెక్ట్స్ యానివర్సిరీకి”

“సాయంత్రం వస్తావా ఆఫీస్‌కి?” అద్దం ముందు నిలబడి పైట సరిచేసుకుంటూ అడిగింది.

“ఓ”

“బై!” వెళ్ళిపోయింది

*                    *                    *

లైబ్రేరియన్ సురేష్‌ని చూస్తూనే విష్ చేసింది.

“...నిన్న రాలేదేం?”

“నిన్న హాలిడే”